సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

క్షేత్రస్థాయి అభ్యసనే మేలు



కార్యక్రమంలో పాల్గొన్న షేక్ షిరీన్ బేగం, సంస్థ ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడానికి క్షేత్రస్థాయి అభ్యసన దోహదపడుతుందని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ఎండీ షేక్ షిరీన్ బేగం అన్నారు. బీచ్ రోడ్డులోని ఒక హోటల్‌లో స్కాలాస్టిక్-ఎడ్యు-డిపోట్ (ఎస్ఈడీ) ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఫిజిక్స్ పరికరాల ప్రదర్శనను ఆమె ప్రారంభించి మాట్లాడారు. 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు విద్యా బోధన సులభతరంగా ఉండేందుకు సైన్స్ పరికరాలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థికి బోధనతోపాటు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి అవగాహన కల్పించడం ద్వారా శాశ్వతంగా గుర్తుండిపోతుందని సూచించారు. ఈ ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ఎస్ఎం రెహమాన్, డైరెక్టర్లు సయ్యద్ ఖగీముద్దీన్, అన్వర్, యూసఫ్ తదితరుల పాల్గొన్నారు.

'ఆర్టీసీ అధికారులు వైఖరి మార్చుకోవాలి'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

మద్దిలపాలెం : ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం చేసిన తర్వాత అధికారుల వైఖరిలో మాత్రం మార్పు రాలేదని, ఇంకా పాత పద్ధతిలోనే వ్యవహరిస్తూ ఉద్యోగులను వేధిస్తున్నారని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల 58 సమస్యలపై ఎండీకి మెమొరండం ఇచ్చామన్నారు. ఈ మేరకు బుధవారం మద్దిలపాలెం ఎన్ఎంయూఏ కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం ఆర్టీసీ అధికారులు, యాజమాన్యానికి అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు రోజులుగా రెడ్ బ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి పి.వి.వి.మోహన్, జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తి, రీజినల్ కార్యదర్శి పాలపర్తి చిన్న, డిపో అధ్యక్షుడు ఎం.ఈశ్వరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యోగార్థులకు క్విజ్ పోటీ



మొదటి బహుమతి సాధించిన విద్యార్థులతో క్విజ్ మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో బుధవారం ఉద్యోగార్థులకు గ్రూప్-2 పరీక్షల ప్రణాళిక ఆధారంగా వివిధ అంశాలపై క్విజ్ పోటీ నిర్వహించారు. 50 మంది విద్యార్థులు ఏడు బృందాలుగా పాల్గొన్నారు. ఏడు రౌండ్లలో జరిగిన పోటీలో గెలిచిన విజేతలకు పుస్తకాలను బహుమతిగా ప్రదానం చేశారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డాక్టర్ డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు.

రౌడీషీటర్ వీరంగం

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధి శ్రీనగర్‌కు చెందిన గోపి అనే రౌడీషీటర్ వీరంగం సృష్టించాడు. వివరాలిలా.. జీవీఎంసీ 27వ వార్డు శ్రీనగర్‌లో నివసిస్తున్న ఈతలపాక గోపి అనే రౌడీషీటర్ బుధవారం అదే ప్రాంతానికి చెందిన వ్యక్తిని కొట్టాడు. స్థానికులు అందించిన సమాచారంతో ద్వారకా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కొండవాలుకు జలకళ



కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తోంది. కొండవాలులో ముఖ్యంగా మెట్ల మార్గాల నిర్మాణం, వీధిలైట్ల ఏర్పాటు, తాగునీటి సరఫరా పనులకు అధిక ప్రాధాన్యమిచ్చి తగు చర్యలు చేపట్టింది. గత టీడీపీ ప్రభుత్వం కొండవాలు ప్రాంతాల గోడును గాలికొదిలేసింది. అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగుతుండటంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కుళాయి కనెక్షన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య(ఫైల్)

- దుర్గానగర్ కొండవాలు ప్రాంతంలో 308 కుళాయి కనెక్షన్ల ఏర్పాటు
- 3 వేల మందికి తాగునీటి సౌకర్యం
- సమస్య పరిష్కారంపై నివాసుల ఆనందం
- సీఎం వైఎస్ జగన్ పాలనపై హర్షం



పైప్‌లైన్‌పై ఏర్పాటు చేసిన వాల్వ్



పైప్‌లైన్ నుంచి ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు దుర్గానగర్ కొండవాలు ప్రాంతం జలకళతో కళకళలాడుతోంది. నాడు గుక్కెడు నీటి కోసం ఉసురుమంటూ కొండపై నుంచి కింద వచ్చి బిందెలతో మోసుకునే దుస్థితి ఉండేది. అటువంటి ఇబ్బందులకు సీఎం వైఎస్ జగన్ పాలనలో నేడు తెరపడింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే నిర్వహించిన జీవీఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్‌గా గెలుపొందిన అప్పారి శ్రీవిద్య చొరవతో కొండవాలు ప్రాంతాల్లో ఇంటింటికీ తాగునీటి కుళాయి కనెక్షన్లు అందించారు. కొండవాలులో ప్రత్యేకంగా పైప్‌లైన్లు అమర్చి వాటి ద్వారా వచ్చే నీటిని ఇంటింటికీ చేర్చేందుకు కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. దీంతో ఎంచక్కా ఇంటి వద్దకే నీరు రావడంతో దుర్గానగర్ కాలనీ వాసులు సంబరపడిపోతున్నారు.

రూ.19.50 లక్షలతో పైప్‌లైన్, కుళాయిలు

దుర్గానగర్ కొండవాలు ప్రాంతంలో సుమారు 3 వేల మంది నివసిస్తున్నారు. వీరికి ఎన్నాళ్లు గానో తాగునీటి సౌకర్యం లేదు. దీంతో కొండపై నుంచి కిందకి వచ్చి నీరు మోసుకుంటూ వెళ్లేవారు. ఈ సమస్య పరిష్కారానికి స్థానిక కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య వినతి మేరకు జీవీఎంసీ నుంచి రూ.19.50 లక్షల నిధులు మంజూరు చేశారు. వాటితో దుర్గానగర్ కాలనీకి పైప్‌లైన్ల నిర్మాణం చేపట్టారు.



దుర్గానగర్ కొండవాలు ప్రాంతంపైకి ఏర్పాటు చేసిన పైప్‌లైన్

ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు

దుర్గానగర్‌లో తాగునీటి సౌకర్యం కల్పించడానికి పెద్ద పైప్‌లైన్ నిర్మించారు. దీని నుంచి ఇంటింటికీ 308 కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. కొండవాలులో నివసిస్తున్న వారి తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో కొండపైకి నీరు మోసుకెళ్లే ఇబ్బందులు తొలగాయంటూ స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల నాటి సమస్య పరిష్కారం కావడంతో జగనన్న పాలనకు నీరజనాలు పలుకుతున్నారు.

ఏళ్ల నాటి సమస్య తీరింది



కొండవాలు నివాసులు గుక్కెడు నీటి కోసం పడే కష్టలు అన్నీ ఇన్నీ కావు. ఏకంగా కొండపైకి పైప్‌లైను వేసి ఏళ్లుగా పడుతున్న మా కష్టాన్ని తీర్చారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ఇప్పుడు ఇంటి దగ్గరకే నీరు రావడంతో మా ఆనందానికి హద్దు లేకుండా పోయింది.

– వరలక్ష్మి, దుర్గానగర్

జగనన్నకు రుణపడి ఉంటాం



కొండపైకి తాగునీరు అందించి మా కష్టాన్ని తొలగించారు. పాలకులకు రుణపడి ఉంటాం. గతంలో బోరు వేశారు. ఇప్పుడు ఏకంగా జీవీఎంసీ కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతున్న జగన్ననే మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని ఆశిస్తున్నాం.

– నగరాల కళ్యాణి, స్థానికురాలు

తాగునీటి కష్టాలు తొలగించారు



కొండపైకి నీళ్లు మోసుకుంటూ వెళ్లడం చాలా కష్టమైన పని. అలాంటి కొండంత కష్టాన్ని తీర్చారు. మీ రుణం తీర్చుకోలేం. ఏకంగా ఇంటి దగ్గరే కుళాయి కనెక్షన్ వేశారు. తాగునీటి కష్టాలు లేకుండా చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కార్పొరేటర్ శ్రీవిద్యలకు మా కృతజ్ఞతలు.

– అనురాధ, దుర్గానగర్

సంక్షేమ పథకాలతో ప్రజలకు మేలు



వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరిస్తున్న గొలగాని శ్రీనివాస్

ఆరిలోవ: 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం జీవీఎంసీ 11వ వార్డు 14, 15వ నంబరు సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్ పాల్గొని పార్టీ జెండా, రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఫ్లెక్సీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. 11వ వార్డులో పేదలందరికీ అన్ని రకాల సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రోడ్లు, కాలువల నిర్మాణాలు, సామాజిక భవనాల నిర్మాణం, గెడ్డల ఆధునికీకరణ వేగంగా జరుగుతున్నాయన్నారు. అందుకే ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు, సచివాలయాల సిబ్బంది, కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

సూర్యతేజనగర్ బ్రిడ్జి సిద్ధం

- ప్రశాంతంగా వాహనాల రాకపోకలు



సూర్యతేజనగర్ వద్ద కొత్తగా నిర్మించిన బ్రిడ్జి

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం 12, 13వ వార్డుల పరిధిలో సూర్యతేజనగర్ వద్ద కొత్తగా నిర్మించిన బ్రిడ్జి సిద్ధమైంది. బ్రిడ్జికి రెండు వైపులా తారు రోడ్డు నిర్మాణ పనులు మాత్రమే పూర్తవ్వాల్సి ఉంది. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బంది లేకుండా వాహనాల రాకపోకలు రెండు రోజులుగా జరుగుతున్నాయి. చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం వద్ద బీఆర్‌టీఎస్ కూడలి నుంచి ఆరిలోవ వైపు వెళ్లే సూర్యతేజనగర్ వరకు ఇటీవల జీవీఎంసీ నిధులతో డబుల్ రోడ్డు నిర్మించింది. ఈ రోడ్డు చివరన సూర్యతేజనగర్, పార్వతినగర్ మధ్య పెద్ద గెడ్డపై ఇరుకైన బ్రిడ్జి ఉండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో జీవీఎంసీ అధికారులు ఇక్కడి గెడ్డపై విశాలమైన బ్రిడ్జి నిర్మించారు. సుమారు రూ.3 కోట్ల నిధులతో ఈ గ్రామాల మధ్య పెద్ద బ్రిడ్జితోపాటు దాని పక్కనే మరో గెడ్డపై చిన్న కల్వర్టు నిర్మించారు. ఈ పనులు శరవేగంగా చేపట్టడంతో సుమారు నాలుగు నెలల్లో నిర్మాణం పూర్తయింది. బ్రిడ్జికి ఇరువైపులా సుమారు 50 మీటర్ల దూరంలో తారు రోడ్డు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం ఇక్కడ మెటల్ వర్క్ జరగడంతో ఇబ్బంది లేకుండా వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. బ్రిడ్జి పనులు జరుగుతున్నంత కాలం సుమారు నాలుగు నెలలుపాటు ఆరిలోవ ప్రాంతం నుంచి చినగదిలి వెళ్లాల్సిన వారు ప్రత్యామ్నాయ మార్గాల్లో ఇరుకు రోడ్లలో ప్రయాణించేవారు. ఇప్పుడు వారికి ఆ సమస్య తీరిపోయింది. రెండు రోజులుగా బ్రిడ్జి మీదుగా వాహనచోదకులు రాకపోకలు సాగిస్తున్నారు.

ఏవీఎన్ కాలేజీలో ముగిసిన 'ఆహ్వాన్ ఫెస్ట్'



ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డిని సత్కరిస్తున్న ఏవీఎన్ కళాశాల యాజమాన్యం

డాబాగార్డెన్స్: నిత్యం పాఠ్యాంశాల బోధన, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసే విద్యా సంస్థ.. కళలు, క్రీడలతో సందడిగా మారింది. ఆటపాటలతో అలరించడం ప్రత్యేకంగా నిలిచింది. సినీ హీరోయిన్, సినీ డైరెక్టర్, టీవీ కళాకారులు.. విద్యార్థులను తొలి రోజు మంత్రముగ్ధులను చేయగా.. ఇంద్రజాల ప్రదర్శనతో రెండో రోజు విద్యార్థులు పులకించారు. ఏవీఎస్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహించిన 'ఆహ్వాన్ ఫెస్ట్-2023' బుధవారంతో ఘనంగా ముగిసింది. ఫెస్ట్‌లో భాగంగా ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. విద్యార్థుల్లో నూతనోత్సాహానికి ఆహ్వానం పలికారు. సినీ నటుడు, జీవీఎంసీ బ్రాండ్ అంబాసిడర్ ఇనుగోలు ప్రసన్నకుమార్, సినీ హీరోయిన్ అవికాగోర్, జబర్దస్త్ ఫేమ్ బుల్లెట్ భాస్కర్‌ల సందడితో కళాశాల ప్రాంగణం నిండింది. అనంతరం కళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ ఇంద్రజాలికుడు బీఎస్ రెడ్డి ఇంద్రజాల కళలో తనకున్న ప్రావీణ్యాన్ని ప్రదర్శించి ఆద్యంతం ఆకట్టుకున్నారు. ఏవీఎస్ కళాశాలలో చదువుకోవడం తన పూర్వజన్మ సుకృతమని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ అదీప్ భానోజీరావు మాట్లాడుతూ తమ పూర్వీకుల కాలం నుంచి ఏవీఎన్ కళాశాల ఉత్తరాంధ్ర జిల్లాలకే పరిమితం కాకుండా, ఇతర ప్రాంతాలకు చెందిన వారికి విద్య అందిస్తోందన్నారు. కళాశాలకు ఉన్న చారిత్రక నేపథ్యాన్ని గుర్తు చేసుకుంటూ విద్యారంగ అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. ఏయూ ప్రొఫెసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా పోటీతత్వంతో ముందుకు సాగాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, శంకర్‌నారాయణ, మీడియా కో ఆర్డినేటర్ పైడి రజని, స్వరాజ్యలక్ష్మి, గాంధీ, సంతోషి, రామ్‌కుమార్, మహాలక్ష్మి, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

29 నుంచి యోగా తరగతులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా, కాన్షియస్‌నెస్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి స్థూలకాయ నివారణ, థెరపటిక్ యోగా తరగతులను నిర్వహిస్తున్నట్లు యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు యోగా తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు బీచ్ రోడ్డులోని యోగా కేంద్రంలో, 83743 51324, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా'



కబడ్డీ ఆడుతున్న యువతులు



ఏయూ క్రీడా మైదానంలో క్రికెట్ ఆడుతున్న యువత



ఖోఖో ఆటలో యువతుల సందడి



బ్యాడ్మింటన్ ఆడుతున్న యువకులు

ఏయూక్యాంపస్: రాష్ట్ర యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచే విధంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. యువతీ, యువకుల్లో క్రీడా ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. తూర్పు నియోజకవర్గం పరిధిలోని ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానం వేదికగా బుధవారం క్రికెట్, కోకో, కబడ్డీ పోటీలు నిర్వహించారు. పురుషుల క్రికెట్ పోటీలు, యువతుల కబడ్డీ, ఖోఖో పోటీలు ఎంతో ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. మధ్యాహ్నం నుంచి ఏయూ జిమ్నాసియంలో ఇండోర్ షటిల్ కోర్టులో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. నగర యువత ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభ చూపారు. వార్డు స్థాయి నుంచి క్రీడల్లో యువత రాణించేలా ప్రోత్సహించే దిశగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై యువత సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ఉదయం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ఆలయ ఈవో జి.వి.రమాబాయి ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చకులు శ్రీనివాస్ పంచామృతాభిషేకం, భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి పసుపునీళ్లతో భక్తులు మరోమారు జలాభిషేకం చేశారు. ప్రత్యేక పూలతో అలంకరణ అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. సిబ్బంది సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

గీతం అవగాహన ఒప్పందం

కొమ్మాది: సముద్ర పరిశోధన సంస్థలో ఒకటైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఓషనోగ్రఫీతో సంయుక్త పరిశోధనలు జరపడానికి, పరస్పర సహకారానికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. స్కూల్ ఆఫ్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ సమక్షంలో ఎన్ఐవో ఇన్‌చార్జి ప్రొఫెసర్ వీవీఎస్ఎస్ శర్మ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.

మిద్దె తోటల పెంపకం అవసరం



మహిళలకు మొక్కలు అందజేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

ఆరిలోవ: విశాఖను హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు మిద్దె తోటల పెంపకం అవసరమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో 13వ వార్డులో బుధవారం మిద్దె తోటల పెంపకంపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ కెల్ల సునీత, జోన్-2 అధికారులతో కలిసి ఆమె స్థానిక మహిళలకు మొక్కలు, విత్తనాలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మేయర్ మాట్లాడుతూ ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా ఎకో గ్రీన్ అంశంపై టెర్రాస్ గార్డెన్‌లు అభివృద్ధి చేయాలన్నారు. అపార్ట్‌మెంట్లు, భవనాలపైన, గేటెడ్ కమ్యూనిటీల వద్ద మిద్దె తోటలు పెంచాలని సూచించారు. పచ్చదనం ఇచ్చే మొక్కలతోపాటు ఆకుకూరలు, కూరగాయల మొక్కలు కూడా పెంచుకోవచ్చన్నారు. వీటికి సంబంధించిన 12 రకాల విత్తనాలు ఏవిధంగా వినియోగించాలి, 12 రకాల మొక్కలను ఏవిధంగా పెంచాలో ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు. అపార్ట్‌మెంట్లలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు పెంచాలని మేయర్ కోరారు. కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ కనకమహాలక్ష్మి, యూసీడీ ప్రోజెక్టు ఆఫీసర్ డి.లక్ష్మి, డీపీవో ప్రసాద్, ఎస్ఆర్‌యూ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు శ్రీ దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవం ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. బుధవారం ఆలయంలో నిర్వహించిన సమావేశంలో పిళ్లా సూరిబాబు, పిళ్లా చంద్రశేఖర్ మాట్లాడారు. జాతర గట్టుపై వెలసిన శ్రీ పంచముఖ ఆంజనేయ, షిర్డీసాయినాథ సహిత దుర్గాలమ్మ ఆలయ వార్షికోత్సవాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. శుక్రవారం క్షేత్రపాలకుడు పంచముఖ ఆంజనేయ స్వామికి సుగంధ పంచామృత అభిషేకాలు, అనంతరం నాగవల్లి దళార్చన, సిందూరార్చన, పుష్పార్చనతో వేడుకలు ప్రారంభిస్తామని తెలిపారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం



మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అదిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు కుమారాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేడుకగా రాపత్తు ఉత్సవాలు

సింహగిరిపై జరుగుతున్న రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు బుధవారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వామనుడిగా దర్శనమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వామనుడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేతంగా పల్లకీలో అదిష్టింపజేశారు. ఆళ్వారులను వేరే పల్లకీలో వేంచేయజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు.